
మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే

చేవెళ్ల, జూన్ 19 : మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై అధికారులు పది రోజులుగా ఇంటింటి సర్వే చేస్తున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ప్రతీ ఇంటికీ వెళ్లి సంబంధిత ఇంటి యాజమని వివరాలు సేకరించి ఆధార్ నెంబర్‌తో పాటు యాజమాని ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వే పనులు జోరుగా చేపడుతున్నారు.

సమస్యల ఒడి.. సర్కారు బడి!

ప్రభుత్వ బడులు సమస్యల్లో కునారిల్లుతున్నాయి. ఇక్కడ విద్యార్థులకు సదుపాయాలు లోపించాయి. పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో కొన్నిచోట్ల పంచాయతీ కార్యాయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా అనుకున్న ఫలితాలు రావడం లేదు. ప్రభుత్వ స్కూళ్లపై నిత్యం పర్యవేక్షించాల్సిన వ్యవస్థ కూడా పటిష్టంగా లేకపోవడం కూడా దుస్థితికి కారణం అవుతోంది. దీంతో విద్యా ప్రమాణాలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. క్షేత్రస్థాయిలో పాఠశాలల పర్యవేక్షించే ఎంఈవో, డిప్యూటీ డీఈవో వంటి పోస్టులు ఏళ్లుగా ఖాళీగా ఉంటున్నాయి.

- నిరుపయోగంగా మరుగుదొడ్లు.. బాలికల ఇబ్బందులు
- రంగారెడ్డి జిల్లాలో ఒకే ఒక్క రెగ్యులర్ ఎంఈవో
- డిప్యూటీ డీఈవో, రెగ్యులర్ ఎంఈవోలు లేక కొరవడిన పర్యవేక్షణ
- రూ. వేల కోట్లు వెచ్చిస్తున్నా సౌకర్యాలు అంతంత మాత్రమే
- మూన్నాళ్ల ముచ్చటగా బ్రేక్‌ఫాస్ట్ పథకం
- రోజురోజుకూ పడిపోతున్న ప్రమాణాలు
- సర్కారు బడులపై సన్నగిల్లుతున్న నమ్మకం
- ప్రైవేట్ బడులను ఆశ్రయిస్తున్న తల్లిదండ్రులు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/ వికారాబాద్/ మేడ్చల్, జూన్ 19): ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయి. భావి పౌరులను తీర్చిదిద్దాల్సిన పాఠశాలలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం ఏటా రూ.వేల కోట్లు వెచ్చిస్తున్నా బూడిదలో పోసిన పన్నీరే అవుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వంటి కారణాలు ఈ దుస్థితికి దారి తీస్తున్నాయి. విద్యా ప్రమాణాలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. క్షేత్రస్థాయిలో పాఠశాలల పర్యవేక్షించే ఎంఈవో, డిప్యూటీ డీఈవో పోస్టులు ఏళ్లుగా ఖాళీగా ఉంటున్నాయి. రంగారెడ్డి జిల్లాలో 'మన ఊరు-మన బడి'లో భాగంగా మొదటి విడత 464 పాఠశాలలు ఎంపిక చేశారు. 448 పాఠశాలలకు రూ.97.88కోట్ల మంజూరు చేసినా పనులు పూర్తి స్థాయిలో కాలేదు. ఈ సారి అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మొదటి విడత 423 పాఠశాలలను ఎంపిక చేశారు. తాగునీరు, విద్యుద్దీకరణ, చిన్న మరమ్మతులు, మూత్రశాలల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా పనులు వివిధ దశల్లోనే ఉన్నాయి. పర్యవేక్షణ లోపంతో పురోగతి లేదు. వికారాబాద్ జిల్లాలో 'మన ఊరు-మన బడి' కింద 371 బడులను ఎంపిక చేశారు. రూ.23కోట్లతో 45 పాఠశాలల్లో కొన్ని పనులు చేసి మమ అనిపించేశారు. ఇప్పుడు అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద 1,064 పాఠశాలల్లో పనులు చేపట్టగా 600పాఠశాలల్లో పనులు పూర్తి చేసినట్లు సమాచారం.

శిథిల భవనాల్లో బోధన

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ బడులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. చేవెళ్ల మండలం దేవరాంపల్లి ప్రైమరీ పాఠశాల శిథిలావస్థకు చేరింది. దీంతో రెండేళ్లుగా విద్యార్థులను పంచాయతీ కార్యాలయంలో పాఠాలు బోధిస్తున్నారు. పంచాయతీ మీటింగ్ సమయంలో పిల్లలను చెట్లకింద కూర్చోబెడుతున్నారు. అద్దె బిల్డింగ్‌లోకి మార్చాలని కలెక్టర్ ఆదేశించగా అంగన్‌వాడీ భవనంలోకి షిఫ్ట్ చేశారు. వికారాబాద్‌లోని జడ్పీ బాలుర పాఠశాల వర్షం కురిస్తే తరగతి గదులు జలమయమవుతాయి. వరండా ప్రమాదకరంగా మారింది. పైకప్పు కూలి పడే పరిస్థితులు ఉన్నాయి. పరిగి మునిసిపల్ పరిధిలోని మల్లెమోనిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో 74 మంది విద్యార్థులకు నలుగురే ఉపాధ్యాయులు ఉన్నారు. కిటికీలకు తలుపుల్లేవు. గోడలకు పగుళ్లొచ్చాయి. పైకప్పు పెచ్చులూడింది. బేస్మెంట్ పగుళ్లు వచ్చాయి. ఇటీవల పెచ్చు పిల్లల మధ్య పడింది. పెద్దేముల్ మండలం, మదనంతాపూర్ తండాలో పాఠశాల భవనం శిథిలం కావడంతో కమ్యూనిటీ భవనంలో పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. తాండూరు మండలం, జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్‌లో వంట గది శిథిలావస్థకు చేరుకోవడంతో వంట చేయడం ఇబ్బందికరంగా మారింది. యాలాల్ మండల పరిధిలోని గంగాసాగర్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిస్తే తరగతి గదుల్లోకి నీరు చేరుతోంది.



ఉమ్మడి జిల్లాలో పాఠశాలల వివరాలు

పాఠశాలలు	రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
ప్రాథమిక	881	776	375
ప్రాథమికోన్నత	180	111	22
ఉన్నత	248	176	108

శిథిలావస్థలో భవనాలు.. భయం గుప్పిట్లో విద్యార్థులు

ఇన్‌చార్జి ఎంఈవోలతో లోపిస్తున్న పర్యవేక్షణ

రంగారెడ్డి జిల్లాలో 27 మండలాలుండగా హయత్‌నగర్ మండలానికే రెగ్యులర్ ఎంఈవో ఉన్నారు. మిగతా ఎంఈవోలంతా ఇన్‌చార్జిలే. సీనియర్ హెచ్‌ఎంలకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలప్పగించారు. ఒక్కో ఎంఈవోకు మూడు నాలుగు మండలాలను అప్పగించారు. దీంతో వారు ఏ మండలానికీ న్యాయం చేయకపోతున్నారు. జిల్లాకు డిప్యూటీ డీఈవో పోస్టు లేదు. డీఈవో ఒక్కరే ఉండటంతో ఆయనపై పర్యవేక్షణ భారం ఎక్కువైంది. వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కూడా ఇన్‌చార్జి ఎంఈవోలే ఎక్కువగా ఉన్నారు.



కిటికీ స్లాబ్‌పై పెచ్చులు ఊడిన కేశంపేట మండలం ముదార్‌పూర్ ప్రాథమిక పాఠశాల

అరకొర వసతులు.. అవస్థల్లో విద్యార్థులు

ఉమ్మడి జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కరువై విద్యార్థులు అవస్థలు పడుతున్నాయి. మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేక ఇంటి నుంచే విద్యార్థులు నీటిని తెచ్చుకుంటున్నారు. శంకర్‌పల్లి ఉర్దూ మీడియం పాఠశాలలో మరుగుదొడ్లలో నీరు లేక విద్యార్థులు బకెట్లలో నీటిని తెచ్చుకుని కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. వికారాబాద్ జిల్లాలో 930 పాఠశాలల్లో మరమ్మతులతో పాటు కనీస సదుపాయాల కల్పన పనులు చేపట్టగా వాటిలో చాలావరకు తుది దశలో కొనసాగుతున్నాయి. దోమ మండలం, ఊటుపల్లి జడ్పీ ఉన్నత

మిగతా 7వ పేజీలో...

టార్గెట్ 286.. పూర్తయినవి 60

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు ప్రారంభమైనప్పటికీ అవి అరకొరగానే మిగిలిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు- మనబడి పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. 176 పాఠశాలలు ఎంపిక కాగా అందులో దాదాపు 60 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో జిల్లాలో 286 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం 515 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. పనులు వేగవంతం అవుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించినా నిధుల లేమితో నత్తనడకన కొనసాగిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో టెండర్లు పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్లు పనులు చేపట్టడం లేదు. ధర గిట్టుబాటు కానందునే పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిసింది.

మూన్నాళ్ల ముచ్చటగా బ్రేక్‌ఫాస్ట్ పథకం

బ్రేక్‌ఫాస్ట్ పథకం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. గత ప్రభుత్వం ఈ పథకాన్ని 2023 అక్టోబరు 6న మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాలలో నాటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. జిల్లాలో 1,306 పాఠశాలల్లో 1,43,500 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో ప్రారంభించినప్పటికీ.. అమలు కావడం లేదు. మెను ప్రకారం ఎక్కడా అమలు కావడం లేదు. మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.



నీళ్లు మోసుకొస్తున్న శంకర్‌పల్లి ఉర్దూ మీడియం స్కూల్ విద్యార్థినులు



శిథిలావస్థకు చేరిన మైతాప్‌ఖాన్‌గూడ పాఠశాల



నీళ్లు లేక హిమాయత్‌నగర్ స్కూల్లో నిరుపయోగంగా మారిన నల్లాలు



చేవెళ్ల మండలం దేవరాపల్లిలో ప్రాథమిక పాఠశాలకు మరమ్మతులు



శంకర్‌పల్లి ఉర్దూ మీడియం స్కూల్లో నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు



కొడంగల్ మండలం ధర్మపూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాల

సికిల్‌సెల్ అనీమియా నిర్మూలనకు కలిసికట్టుగా ముందుకు సాగాలి

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ సముజ్వల

కడ్తాల్, జూన్ 19 : సికిల్‌సెల్ అనీమియాను సమూలంగా నిర్మూలించేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ సముజ్వల పిలుపునిచ్చారు. 2047 నాటికి సికిల్‌సెల్ అనీమియా నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. కడ్తాల మండలం మైసిగండి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం ప్రపంచ సికిల్‌సెల్ దినాన్ని పురస్కరించుకొని సికిల్‌సెల్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సముజ్వల, డీటీడీవో రామేశ్వరిదేవి, డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వర్ రావు, కడ్తాల జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సికిల్‌సెల్ అనీమియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సముజ్వల మాట్లాడుతూ సికిల్‌సెల్ అనీమియా నిర్మూలనపై జూన్ 19 నుంచి జూలై 3వ తేదీ వరకు రాష్ట్రంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో 0-40 సంవత్సరాల వయస్సు గల రోగులకు గిరిజన సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖల ద్వారా చికిత్స, సంరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రక్తహీనతకు గురయ్యే ఈ వ్యాధిపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. సికిల్‌సెల్ అనీమియా నుంచి దేశాన్ని విముక్తి కలిగించడానికి కేంద్ర ప్రభుత్వం గిరిజన మంత్రిత్వ శాఖ ద్వారా పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందని, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జడ్పీటీసీ దశరథ్ నాయక్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో అజాగ్రత్త తగదని, విద్యార్థులు, యువత, చెడు అలవాట్లు, మద్య, ధూమపానాలకు దూరంగా ఉండాలని సూచించారు. డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వర్‌రావు వ్యాధి లక్షణాలు, నిర్మూలనపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న జేడీ సముజ్వల

ఆరోగ్య సమాజ నిర్మాణానికి మొక్కల పెంపకం దోహదం: డీఎంహెచ్‌వో

ఆరోగ్య సమాజ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ , మానవాళి మనుగడను దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరు ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు కోరారు. కడ్తాల మండలం మైసిగండి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వృక్ష సంపదను పెంపొందించేందుకు విద్యార్థులు, యువకులు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వాతావరణ సమతుల్యత లోపిస్తే మానవాళి మనుగడకు ప్రమాదమన్నారు. వర్షాకాలం ప్రారంభం నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రహదారుల వెంట మొక్కలు నాటాలని వెంకటేశ్వర్‌రావు సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ సముజ్వల, జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, డీటీడీవో రామేశరీదేవి, ఏటీడీవో వెంకటయ్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో గీత, హెచ్‌ఎం బాల్‌రాజ్, స్థానిక వైద్య అధికారి కిరణ్ కుమార్, ఎంపీహెచ్‌ఈవోలు సుధీర్‌బాబు, తిరుపతి రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు మాత్రలు తప్పనిసరి

- జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 19 : ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ నేడు నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు, పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నులి పురుగుల వల్ల ఏర్పడే అనర్థాలను వివరించారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ప్రతియేటా రెండు సార్లు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా నేడు (గురువారం) జిల్లా వ్యాప్తంగా అన్ని వసతి గృహాలు, విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిశోర బాలబాలికల సంఖ్యకు అనుగుణంగా ప్రతీ ఒక్కరికి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని ఆమె సూచించారు. ఏదైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన వారికి జూన్ 27న అందజేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించేలా అవగాహన కలిగించాలన్నారు. గ్రామాలలో దండోరా వేయించాలని, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టల్స్ గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. పిల్లలకు మాత్ర వేయగానే తాగేందుకు తగిన తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అన్ని జాగ్రత్తలు తీసుకొని వంద శాతం మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం నూరు శాతం విజయవంతమయ్యేలా వైద్య, విద్య శాఖతో పాటు ఐసీడీఎస్, సంక్షేమ శాఖల అధికారులు అంకితభావంతో కృషి చేయాలని ప్రతిమాసింగ్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్ మోహన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి పద్మజ రమణ, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా ఇమ్యునైజషన్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి, సంబంధిత జిల్లా అధికారులు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

బీసీజీ వాక్సిన్‌కు ఇంటింటి సర్వే

క్షయ వ్యాధిని నివారించేందుకు వయోజనులకు బీసీజీ వ్యాక్సిన్ వేయడానికి ఇంటింటి సర్వే నిర్వహించాలని వైద్యాధికారులను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు. 18 ఏళ్ల పైబడిన వారికి, 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు, పొగతాగే వారికీ, టీబీ వ్యాధిగ్రస్తులతో సన్నిహిత సంబంధాలు కలిగిన వారికి, ఐదేళ్లలో టీబీ వ్యాధి సోకిన వారికి బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వచ్చని తెలిపారు. 18 ఏళ్ల లోపు వయసున్న వారితో పాటు క్యాన్సర్, హెచ్‌ఐవీతో బాధపడుతున్న వారికి, గర్భిణీ లేదా పాలిచ్చే బాలింతలకు, మూడు నెలల క్రితం రక్తమార్పిడి జరిగిన వ్యక్తులకు, అనారోగ్యంతో ఉన్న వారికి బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వకూడదని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్ మోహన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి పద్మజ రమణ, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా ఇమ్యునైజషన్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభించాలి


చేవెళ్ల, జూన్ 19 : హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభించాలని రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం నగరంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏ) కార్యాలయంలో రీజనల్ మేనేజర్ నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను వివరించారు. పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఐదేళ్ల క్రితం నిధులు మంజూరు చేసినా.. పనులు ముందుకుసాగడం లేదన్నారు. దాంతో ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు సానుకూలంగా స్పందించారని సత్యనారాయణ చెప్పారు. రోడ్డు పనులు తొందరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.



ఆర్‌ఎం నాగేశ్వర్‌రావుతో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

తాండూరు, జూన్ 19 : చికెన్, మటన్, చేపల వ్యర్థాల సేకరణ ఏజెన్సీలకు నిర్వహించిన బహిరంగ వేలంలో రికార్డు స్థాయి ధర పలికింది. బుధవారం తాండూరు మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో నిర్వహించిన వేలంలో ఐదుగురు పాల్గొన్నారు. కొడంగల్ ప్రాంతానికి చెందిన వ్యాపారి ఎంటీ.రఫీ





వ్యర్థాల సేకరణ వేలానికి భారీ స్పందన

రూ.30.35 లక్షలకు వేలం పాడి వ్యర్థాల సేకరణ హక్కును దక్కించుకున్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశానుసారం చైర్‌పర్సన్, కౌన్సిలర్ల సహకారంతో వేలాన్ని నిర్వహించారు. టెండర్ దక్కించుకున్న వ్యాపారి తాండూరు మున్సిపాలిటీలో చికెన్, మటన్, చేపల మాంసం వ్యర్థాలను సేకరించి కంపెనీలకు తరలించాలి. వేలంలో తాండూరు, పరిగి, కొడంగల్, గద్వాల ప్రాంత వ్యాపారులు పాల్గొన్నారు. వేలం హక్కు జూలై 1 నుంచి మార్చి 31 వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. టెండర్ దారుడు మున్సిపాలిటీకి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో టెండర్ ప్రక్రియ నిర్వహించినా అప్పట్లో కంపెనీలపై ఫిర్యాదులు రావడంతో వేలాన్ని వాయిదా వేశారు. మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి ఆధ్వర్యంలో వేలాన్ని నిర్వహించారు.



వేలం నిర్వహిస్తున్న మునిసిపల్ అధికారులు

ఎమ్మెల్యే యాదయ్య కాంగ్రెస్‌లకొస్తే కల్లోలం సృష్టిస్తాం

నవాబుపేట, జూన్ 19: చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలోకి వస్తే కల్లోలం సృష్టిస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య అన్నారు. బుధవారం నవాబుపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవేళ్ల బి-బ్లాక్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మార్కెట్ కమిటీ చైర్మన్, కోఆప్షన్, ఎంపీటీసీ టికెట్లను ఎమ్మెల్యే యాదయ్య అమ్ముకున్నారని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ సామ వెంకట్‌రెడ్డి, అధికార ప్రతినిధి యాదగిరి, నాయకులు సంజీవరెడ్డి, నర్సింహారెడ్డి, బందెయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నకిలీ డాక్యుమెంట్లపై చర్యలు చేపట్టాలి

ఘట్‌కేసర్, జూన్ 19 : ఘట్‌కేసర్ రెవెన్యూలోని సర్వే నంబర్లు 244, 245, 248, 288లలోని దత్తాత్రేయ వెంచర్‌లో నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ సంగీతాప్రభాకర్‌రెడ్డి బుధవారం ఘట్‌కేసర్ సబ్ రిజిస్ట్రార్ జగన్‌మోహన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. దత్తాత్రేయనగర్‌లోని ప్లాట్ నంబర్లు 96, 411, 421, 485లకు నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారని తెలిపారు. ఇలాంటి మోసాలు ఇంకా అనేకం జరిగాయని, ఈ లేఅవుట్‌లో రిజిస్ట్రేషన్లకు వచ్చిన డాక్యుమెంట్లను పరిశీలించాలని కోరారు. ఒక్కో ప్లాటు ధర లక్షల్లో ఉందని, ఈ విషయం తెలియని అమయకులు ప్లాట్లు కొని మోసపోతున్నారని వివరించారు. నకిలీ డాక్యుమెంట్ల తయారీ ముఠాతో రియల్ బ్రోకర్ల హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిఘా పెట్టి నకిలీ డాక్యుమెంట్ల తయారీ ముఠాను పట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.



సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ సంగీతారెడ్డి

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ధారూరు, జూన్ 19: పెండింగ్ వేతనాలు చెల్లించాలని బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీకార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల 5నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండు చేశారు. కార్మికులకు రూ.10లక్షల ప్రమాద బీమా కల్పించాలన్నారు. సమస్యలపై ఈ నెల 25న కలెక్టరేట్ ముట్టడిని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఎంపీవో షఫీఉల్లాకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవికుమార్, అశోక్, మల్లేశం, పెంటయ్య, అనంతయ్య, గోపాల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బషీరాబాద్, జూన్ 19: బషీరాబాద్‌లోని జూనియర్ కళాశాలలో ప్రవేశానికి బాల, బాలికల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నర్సింహారెడ్డి తెలిపారు. జడ్పీ బాలుర పాఠశాల భవనంలో కొత్తగా కాలేజీని ఏర్పాటు చేస్తున్నమన్నారు. ఇంటర్‌లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన ఉంటుందన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ ఓకేషనల్ కోర్సులుంటాయన్నారు. ఈ నెల 30లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎన్ఎస్‌యూఐ సిగ్నేచర్ క్యాంపెయిన్

మేడ్చల్ టౌన్, జూన్ 19: నీట్ విద్యార్థులకు న్యాయం జరగాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బుధవారం సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు మార్కుల విషయంలో న్యాయం జరిగేంత వరకు ఎన్ఎస్‌యూఐ అండగా ఉంటుందని నేతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి రాకేష్, శ్రీధర్, వరుణ్‌రెడ్డి, శశి, విజయ్ పాల్గొన్నారు.

















విధుల పట్ల అసత్వం వహిస్తే చర్యలు తప్పవు

నవాబుపేట, జూన్ 19: విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జడ్పీ సీఈవో సుధీర్ అన్నారు. బుధవారం నవాబుపేట మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలు తీర్చేందుకు ప్రతీ ఉద్యోగి కృషిచేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు తదితర సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో అనురాధ, సూపరింటెండెంట్ అజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నల్సార్ ప్రొఫెసర్లుగా గోపాలకృష్ణ గాంధీ, సాయినాథ్‌ల నియామకం

శామీర్‌పేట, జూన్ 19 : శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్శిటీ ప్రొఫెసర్లుగా మాజీ గవర్నర్, దౌత్యవేత్త గోపాలకృష్ణ గాంధీ, మెగాసెసె అవార్డు గ్రహీత సాయినాథ్‌లు నియమితులయ్యారు. గోపాలకృష్ణ ప్రజాపాలనరంగం, దౌత్యరంగంలోను, పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా, తదితర ఉన్నత బాధ్యతలు నిర్వహించారు. అలాగే ప్రొఫెసర్ సాయినాథ్ 2007లో రామన్ మెగసెసె అవార్డుతో పాటు 60కి పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా నల్సార్ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ కృష్ణదేవరావు మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో మేధావుల బోధనల ద్వారా చట్టమనేది కేవలం సాంకేతిక విషయంపై అధ్యయనం మాత్రమే కాదని, విద్యార్థులకు సామాజిక, ఆర్థిక న్యాయానికి లోతైన ప్రశ్నలు, అంశాలను అందించడం అవసరమని ఆయన వెల్లడించారు.

సమస్యల ఒడి.. సర్కారు బడి!

(ఐదో పేజీ తరువాయి)


వికారాబాద్ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా మరుగుదొడ్లు

పాఠశాలలో 8వ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. తరగతి గదుల కొరత నెలకొంది. వికారాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు సైతం మరమ్మతులకు నోచుకోవడం లేదు. మోమిన్‌పేట్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఉండగా, 150 మంది విద్యార్థులకు 12 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న మెట్లకుంట ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి అధ్వానంగా మారింది. ఈ పాఠశాలలో 1 నుంచి 5 తరగతులకు ముగ్గురు ఉపాధ్యాయులున్నారు. ప్రాథమిక పాఠశాల పురాతన భవనాన్ని ఇటీవల మరమ్మతులు చేసి పైకప్పు వేసినా ఎత్తు పెంచకపోవడం, కిటికీలు లేకపోవడంతో సరైన వెలుతురు రాక విద్యార్థులు చీకట్లో విద్యను అభ్యసించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇటీవల ఈదురు గాలులకు వంట గది రేకులు లేచిపోయినా మరమ్మతులు చేయలేదు. విద్యార్థులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు.

సమస్యగా మారిన అపరిశుభ్రత..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త కష్టాలు ఎదురవుతున్నాయి. బడుల్లో స్వీపర్లు, అటెండర్లను లేకపోవడంతో పారిశుధ్య సమస్యలు నెలకొంటున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత అతి పెద్ద సమస్యగా మారింది. ప్రభుత్వ పాఠశాలలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలని, ఆ బాధ్యత స్థానిక సంస్థలదేనంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ పరిస్థితుల్లో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు. సర్కారు బడుల పరిశుభ్రత బాధ్యతలను స్థానిక సంస్థలకు అప్పగించారు. చిన్న గ్రామ పంచాయతీల్లో పరిస్థితి ఎలా ఉన్నా..మేజర్ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మాత్రం పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉండటంతో అసలు సమస్య వచ్చి పడుతోంది. ప్రతిరోజూ పాఠశాలలకు వెళ్లి క్లీన్ చేయడం కష్టంగా మారింది. పాఠశాల గదులన్నీ దుమ్ముతో నిండుతున్నాయి. అంతే కాకుండా క్లీనింగ్ చేసేందుకు వెళ్తున్న పారిశుధ్య కార్మికులు కేవలం పాఠశాల ఆవరణను ఊడ్చి వెళ్తున్నారు. దీంతో తరగతి గదులు అపరిశుభ్రతతో ఉంటున్నాయి.


పెద్దేముల్: కమ్యూనిటీ భవనంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు

మా ఊరు బడిని పట్టించుకోవడం లేదు



మా ఊరు పాఠశాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. గత ఐదేళ్ల నుంచి పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. వర్షం పడితే పాఠశాలలో వరద నీరు చేరుతోంది. ఈ పరిస్థితి రెండేళ్లుగా ఎక్కువ కావడంతో గ్రామ పెద్దలు మాట్లాడి పంచాయతీ కార్యాలయంలో స్కూలు ఏర్పాటు చేయించారు. కొద్ది రోజుల క్రితం అధికారులు అంగన్‌వాడీ భవనంలోకి మార్చారు. వసతులు లేక పిల్లలంతా ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్నారు.

మహమ్మద్ శఫీ, దేవరంపల్లి గ్రామస్తుడు

కొత్త బిల్డింగ్ మంజూరు చేయాలి



శిథిలావస్థకు చేరిన మాఊరు పాఠశాలను డిస్మెంటల్ చేసి అదే స్థలంలో కొత్త భవనాన్ని మంజూరు చేయాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి. మాఊరు మండలానికి చాలా దూరంలో ఉండటంతో ఉన్నతాధికారులు ఎవరూ ఇక్కడికి రావడం లేదు. పర్యవేక్షణ కొరవడింది.

మాణిక్యరెడ్డి, దేవరంపల్లి

మా బాబును ప్రైవేట్‌కు మార్చాను



ప్రభుత్వ పాఠశాలలో నా కొడుకును 5వ తరగతి వరకు చదివించాను. ప్రభుత్వ బడుల తీరు నచ్చక ప్రైవేట్‌లో చేర్పించాను. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయడం లేదు. ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. పిల్లలను పట్టించుకోవడం లేదు.

ఎల్గని నరేష్‌గౌడ్, హిమాయత్‌నగర్, మొయినాబాద్ మండలం

ఆర్అండ్‌బీ అతిథిగృహ నిర్మాణానికి మంత్రి హామీ

- రూ. 4.40 కోట్ల మంజూరుకు అంగీకారం
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 19: షాద్‌నగర్ ఆర్అండ్‌బీ అతిథిగృహ నూతన భవన నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతి పత్రాన్ని ఇచ్చినట్లు పేర్కొన్నారు. షాద్‌నగర్‌లో స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించిన అతిథి గృహం శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవనం నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. అతిథిగృహ నిర్మాణానికి రూ.4.40 కోట్లు, ఆర్అండ్‌బీ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.80 లక్షల రూపాయల మంజూరుకు మంత్రి అంగీకారం తెలిపారని ఎమ్మెల్యే వివరించారు. అనంతరం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి, సాగునీటి సమస్యను శాశ్వతంగా నిర్మూలించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇచ్చినట్లు ఎమ్మెల్యే శంకర్ తెలిపారు.

పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి : వీర్లపల్లి

పాడిపరిశ్రమాభివృద్ధి కోసం అసెంబ్లీలో ప్రస్తావించి, సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కాసాన్‌పల్లి శివారులో ప్రారంభోత్సవానికి నోచుకోని ఘనీకృత వీర్యనాళికల ఉత్పత్తి కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. భవన నిర్మాణాలకే పరిమితమైన కేంద్రం పరిస్థితిని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రవణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం ప్రారంభమైతే ప్రతీ యేటా 11 లక్షల వీర్య నాళికలను ఉత్పత్తి చేసి, పాడి రైతులకు పంపిణీతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయవచ్చని వివరించారు. అలాగే షాద్‌నగర్‌లో పశుసంవర్థకశాఖ ఏడీ కార్యాలయ పునః రుద్ధరణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అసెంబ్లీలో ప్రస్తావించి, సమస్యలను పరిష్కరిస్తానన్నారు.


మంత్రి కోమటి వెంకట్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బట్టు లలిత రమేశ్

ఆర్టీసీ స్థలంలో చిరు వ్యాపారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

మర్పల్లి, జూన్ 19: ఆర్టీసీ స్థలంలో ఖాళీచేయించిన చిరు వ్యాపారులకు ఆర్టీసీ నిర్మించే దుకాణ సముదాయాల్లో ప్రాధాన్యం కల్పించాలని ఎంపీపీ బట్టు లలితరమేశ్ అన్నారు. బుధవారం మర్పల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొన్ని రోజులుగా చిన్న వానొచ్చినా గంటల తరబడి విద్యుత్ ఉండడం లేదని విద్యుత్ అధికారులను సభ్యులు నిలదీశారు. తీగలు తెగి సమస్యలొస్తున్నాయని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు అన్నారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం వచ్చే నెల రైతు భరోసా డబ్బులు విడుదల చేస్తుందని ఏవో వసంత తెలిపారు. భగీరథ పైపులైన్ల లీకేజీలతో నీటి సమస్య ఏర్పడుతోందని, మరమ్మతులు చేయాలని అధికారులకు తెలిపారు. బస్టాండ్ స్థలంలో చిరువ్యాపారుల షెడ్లను వారం రోజుల కింద ఖాళీ చేయించగా పేదలు రోడ్డున పడ్డారని, దుకాణాల్లో వారికి ప్రాధాన్యత కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని జడ్పీటీసీ మధుకర్, ఎంపీపీ హెచ్చరించారు. వచ్చే నెల 5న మండల పరిషత్ పదవీకాలం ముగియడంతో ఇదే చివరి సమావేశం అన్నారు. ఐదేళ్లు సహకరించిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలకు ధన్యవాదాలు తెలిపారు. రూ.20కోట్లకుపైగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పాఠశాల భవనాలు నిర్మించామన్నారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సొహైల్, ఎంపీడీవో రాజమల్లయ్య, తహసీల్దార్ గణేశ్, ఎంపీవో సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు అండగా నిలుస్తా

మేడ్చల్ టౌన్, జూన్ 19: ఈవీఎల్ పరిశ్రమ కార్మికులకు అండగా నిలుస్తానని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ పారిశ్రామికవాడలోని ఈవీఎల్ పరిశ్రమ కార్మికులతో బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈవీఎల్ కార్మికులు యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు. వేతనాల పెంపు విషయంలో యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేకూరుస్తానన్నారు. కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ నాయకులు శంభుప్రభాకర్, రమేష్, నరసింహా చారి, రాజయ్య, సిరాజుద్దీన్, రాముడుయాదవ్, నాయకులు ఎస్.మోహన్ రెడ్డి, సందీప్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

సాంకేతిక రంగంలో విద్యార్థులు రాణించాలి

మేడ్చల్ టౌన్, జూన్ 19: ఇంజినీర్లు సాంకేతిక రంగంలో రాణించి ప్రపంచానికి ఉపయోగపడే ఆవిష్కరణలను కనుగొనాలని మల్లారెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో కేంబ్రిడ్జ్ ఇంగ్లిష్ సి-1 లెవల్, సిస్కో సి సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అవార్డుల ప్రదానం చేశారు. ముఖ్య అతిథి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతికరంగంలో చోటుచేసుకుంటున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా మారాలన్నారు. పరిశోధనల పట్ల ఆసక్తి చూపాలన్నారు. నిత్యం కొత్త ఆలోచనలతో ముందుకుసాగాలని సూచించారు. సాంకేతిక పరమైన ఆలోచన విధానాన్ని కార్యరూపంలోని తెచ్చేది ఇంజినీర్లు మాత్రమే అన్నారు. బ్రేన్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ స్ట్రాటజిక్ అడ్వైజర్ బి.తేజారావు మాట్లాడుతూ ప్రపంచానికి ఉపయోగపడే ఆవిష్కరణలను కనుగొని ఇంజినీర్లు గొప్పస్థాయికి ఎదగాలన్నారు. కళాశాల కార్యదర్శి మహేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవీలత పాల్గొన్నారు.


విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘనంగా రాహుల్ బర్త్‌డే వేడుకలు

● కేక్‌లు కట్‌చేసి రాహుల్‌గాంధీకి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు
● పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు


ఆమనగల్లు : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


శంషాబాద్ : రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలో కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం : ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బుధవారం ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జడల రవీందర్‌రెడ్డి, నాయకులు రాచర్ల వెంకటేశ్వర్లు, మంకాల శేఖర్‌రెడ్డి, కోడూరి రమేష్, తదితరులున్నారు.
షాద్‌నగర్ అర్బన్ : దేశంలోని అసమానతలను తొలగించి, సమసమాజ స్థాపన కోసం ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ ఉద్యమిస్తున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో రాహుల్ జన్మదిన వేడుకను నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్‌ను కట్ చేసి, కాంగ్రెస్ నాయకులకు తినిపించారు. జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు బాబర్, జి.బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, చెన్నయ్య, కె.పురుషోత్తంరెడ్డి, తదితరులున్నారు.
కందుకూరు : జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి మండల కేంద్రంలో పార్టీ నేతలతో కలిసి రాహుల్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, నాయకులు కె.రాజాప్రతాప్‌రెడ్డి, ఎండీ అఫ్జల్‌బేగ్, బొక్క భూపాల్‌రెడ్డి, డిల్లీ శ్రీధర్, సిరొండ జగన్, సొడపు వెంకటేష్‌గౌడ్, ఎగ్గిడి జగదీష్‌కురుమ, గణేష్‌నాయక్, పాండుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.
చేవెళ్ల : రాహుల్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి, ఉపాధ్యక్షులు ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం సీనియర్ నాయకులు సున్నపు వసంతం, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు, మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లున్నారు.
శంషాబాద్ : మున్సిపల్ కేంద్రంలో మండల, మున్సిపల్ నాయకులు రాహుల్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మున్సిపల్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్, మండలాధ్యక్షుడు శేఖర్‌యాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్‌చైర్మన్ జె.నరేందర్, డీసీసీ నాయకురాల్లు మైలారం సులోచన, మహేందర్, అక్రమ్, కృష్ణ, కే. మిట్టు, నజీర్, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


కందుకూరు : వేడుకల్లో పాల్గొన్న జడ్పీటీసీ జంగారెడ్డి


చేవెళ్ల : కేక్ కట్ చేస్తున్న నాయకులు

కడ్తాల్ : రాహుల్ జోడో యాత్ర దేశ చరిత్రలో నిలిచిపోయిందని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో రాహుల్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, జిల్లా నాయకుడు భాస్కర్‌రెడ్డి, గురిగళ్ల లక్ష్మయ్య, నాయకులు మల్లేశ్‌గౌడ్, సత్యం యాదవ్, రామకృష్ణ, పర్వతాలు, తదితరులున్నారు.
ఆమనగల్లు : పట్టణంలో రాహుల్ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజీవ్ చౌక్ వద్ద కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలుచోట్ల మొక్కలు నాటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా, మండల నాయకులు మండ్లీ రాములు, ధనుంజయ్య, కృష్ణనాయక్, వస్పుల శ్రీశైలం, విజయ్, ఖలీల్, ఖాదర్, ప్రసాద్, మల్లయ్య, వెంకటేశ్, రజాక్, కరీం, తదితరులున్నారు. రాహుల్ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో జరుపుకున్నారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు.
తలకొండపల్లి : రాహుల్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ నేతలతో కలిసి కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి అంజయ్య, కార్యదర్శి రవీందర్‌యాదవ్, సోషల్ మీడియా తాలుకా కన్వీనర్ అజీమ్, ఆరిఫ్, చెన్నకేశవులు, రమేశ్, డిగ్రీ కృష్ణ, హరిమోహన్‌రెడ్డి, తదితరులున్నారు.


కడ్తాల : కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, హన్యనాయక్


తలకొండపల్లి : కేక్ కట్ చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందిస్తున్న స్వామి, తదితరులు

చేవెళ్ల, జూన్ 19 : విధి నిర్వహణలో ఉండగా హత్యగావింపబడిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించడం అభినందనీయమని చేవెళ్ల విద్యుత్ శాఖ ఏడీఏ స్వామి తెలిపారు. ఐదు నెలల క్రితం చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ హరియా నాయక్‌ను కొందరు దారుణంగా హత్యచేసి చంపేశారు. ఈమేరకు మృతుడు హరియా కుటుంబ సభ్యులకు బుధవారం చేవెళ్ల విద్యుత్ శాఖ ఉద్యోగులంతా కలిసి రూ.లక్ష జమ చేసి అందజేశారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ తోటి ఉద్యోగి హరియా కుటుంబ సభ్యులను ఆర్థికంగా ఆదుకోవడం అభినందనీయమన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు విద్యుత్ శాఖ పరంగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏఈ జానీ మొయినుద్దీన్, 1104 యూనియన్ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీజేవైఎం పార్లమెంట్ నియోజకవర్గం కో-కన్వీనర్‌గా రవిరాథోడ్



ఆమనగల్లు, జూన్ 19: బీజేవైఎం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం కో-కన్వీనర్‌గా ఆమనగల్లు మున్సిపాలిటీ సాకిబండ తండాకు చెందిన రవిరాథోడ్ నియమితులయ్యారు. బుధవారం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ నుంచి రవిరాథోడ్‌కు నియామక ఉత్తర్వులు అందాయి. తెలంగాణ బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా రవిరాథోడ్ అందించిన సేవలకు పార్లమెంట్ స్థాయిలో గుర్తింపు లభించింది. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదీశ్‌లకు రవిరాథోడ్ కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

నందిగామ, జూన్ 19: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా దాతలు విరాళాలు ఇస్తున్నారు. ఈమేరకు బుధవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వి.నారాయణరెడ్డి రూ.లక్ష విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయన్ను గురుస్వామి గిరీష్‌నాయర్ సన్మానించారు. కమిటీ సభ్యులు జె.బాల్‌రెడ్డి, వి.రాంరెడ్డి, సుదర్శన్‌గౌడ్, నర్సింలు, శ్రీకాంత్, కృష్ణారెడ్డి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు ఎంపీడీవోగా కుసుమ మాధురి

ఆమనగల్లు, జూన్ 19: ఆమనగల్లు ఎంపీడీవోగా కుసుమ మాధురి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన పారుఖ్‌హుస్సేన్ మార్చి 30న పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో తలకొండపల్లి ఎంపీడీవో శ్రీకాంత్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. కాగా, హైదరాబాద్ సెర్ప్ కార్యాలయంలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేసిన కుసుమ మాధురికి ఆమనగల్లు ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ అనితవిజయ్, మండల పరిషత్ అధికారులు, ఉద్యోగులు సత్కరించారు. ఎంపీవో శ్రీలత, ఏఈ కృష్ణయ్య, సిబ్బంది కుమార్, ప్రసన్నలత, కవిత, రాకేశ్, నర్సింహ్మ, ఖలీం, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

కడ్తాల్, జూన్ 19: పేదప్రజలకు, బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటానని డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతిచెందిన పోతుగళ్ల పద్మమ్మ, బండి జయమ్మ కుటుంబాలను బుధవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.4వేలు, క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, మండల కో-ఆప్షన్‌సభ్యుడు జహంగీర్‌బాబా, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, సేవాదల్ అధ్యక్షుడు గురిగళ్ల లక్ష్మయ్య, నాయకులు తదితరులున్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

'పట్నం'ను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదాం

ఇబ్రహీంపట్నం, జూన్ 19: పర్యావరణానికి ముప్పుగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని, ఇబ్రహీంపట్నంను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వ్యాపారులకు సూచించారు. బుధవారం పట్నంలోని క్యాంపు కార్యాలయం(ప్రజా భవన్)లో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి వ్యాపారులు, మున్సిపల్, పోలీస్, ట్రాఫిక్ పోలీస్, ఆర్‌అండ్‌బీ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ట్రాఫిక్ తదితర సమస్యలపై సమీక్ష చేశారు. ఇప్పటికే మున్సిపల్ పరిధిలో లైబజార్‌ను రద్దు చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. షాపుల ముందు రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందిగా మారిందని, కట్టడి చేయాల్సి ఉందని ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. ప్రధాన రహదారులపై ఉన్న దుకాణాలకు, లోపల చిన్న రోడ్లపై దుకాణాలకు వేర్వేరుగా ట్యాక్స్‌ను నిర్ణయించాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్‌కు సూచించారు. చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్‌పర్సన్ మంగ, సీఐలు సత్యనారాయణ, గురుస్వామి, ఆర్టీసీ డీఎం వెంకట నర్సప్ప, కౌన్సిలర్లు తదితరులున్నారు.


ఇబ్రహీంపట్నం : వ్యాపారులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం- మంగళ్‌పల్లి రోడ్డు ప్రారంభం

నాగార్జునసాగర్ ప్రధాన రహదారి ఎలిమినేడు క్రాసింగ్ నుంచి ఎలిమినేడు, పోచారం మీదుగా మంగళ్‌పల్లి వరకు రూ.59.20 కోట్ల వ్యయంతో నిర్మించిన డబుల్ రోడ్డును ఎమ్మెల్యే మల్‌రెడ్డి ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం చెరువు సుందరీకరణకు రూ.20 కోట్లు మంజూరైనాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఇబ్రహీంపట్నం టౌన్ పక్కనుంచి కృష్ణా పైప్‌లైన్ వెంట ఉన్న బైపాస్ రోడ్డును బీటీ రోడ్డు మారుస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ భూపతిగల్ల మహిపాల్ తదితరులున్నారు.

యాచారం అభివృద్ధి బాధ్యత నాది : ఎమ్మెల్యే

యాచారం : మండల అభివృద్ధి బాధ్యత నాది అని, మారుమూల గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నానని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. మంతన్‌రెల్లిలో రూ.20లక్షలతో మూడు సీసీ రోడ్లను, రూ.ఐదు లక్షలతో నిర్మించిన డ్రైనేజీ పనులు, కేస్లీతండాలో రూ.10లక్షలతో వేసిన రెండు సీసీ రోడ్లను, నల్లవెల్లిలో రూ.25లక్షలతో వేసిన 3సీసీ రోడ్లను, రూ.పదేసీ లక్షలతో నిర్మించిన 2బీసీ కమ్యూనిటీ భవనాలను, చింతపట్లలో రూ.20లక్షలతో వేసిన నాలుగు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ జ్యోతి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ అరవింద్ నాయక్ తదితరులున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయొద్దు

మహేశ్వరం, జూన్ 19 : రాష్ట్ర ప్రభుత్వం నగర శివారులో ఉన్న మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడానికి కుట్రలు పన్నుతోందని, అలాంటి ఆలోచన చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, తూళ్ల వీరేందర్‌గౌడ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మధుమోహన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ తుక్కుగూడ, మున్సిపాలిటీతో పాటు మీర్‌పేట, బడంగ్‌పేట్ కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక తయారు చేస్తోందని, దానిని బీజేపీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీలను ఏర్పాటు చేసి ఐదేళ్లు పూర్తికాకముందే, కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల ప్రజలపై అధిక పన్నుల భారం పడుతుందన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీతో పాటు మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లను రాజేంద్రనగర్ జోన్‌లో కలపకుండా పార్టీలకు అతీతంగా అందరం కలిసి ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. తుక్కుగూడ కౌన్సిలర్లు శివకుమార్‌గౌడ్, యాదగిరిరెడ్డి, రాజుముదిరాజ్, బాకీ విలాస్, నాయకులు శివయ్యగౌడ్, సుధాకర్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


తుక్కుగూడలో నిరసన తెలుపుతున్న నాయకులు శ్రీరాములు యాదవ్, తూళ్ల వీరేందర్‌గౌడ్

సమయ పాలన పాటించకపోతే చర్యలు


తాళం వేసి ఉన్న పెద్దిరెడ్డి చెరువు తండా, నాగిరెడ్డి గూడ పాఠశాల ఎదుట ఎంఈవో సర్దార్ నాయక్

కడ్తాల్, జూన్ 19: ఉపాధ్యాయులు విధుల పట్ల అలసత్వం వహించినా, సమయ పాలన పాటించకపోయినా చర్యలు తప్పవని మండల విద్యాధికారి సర్దార్‌నాయక్ తెలిపారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఎంఈవో తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాలను, విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. ముద్విన్ ప్రాథమిక పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులకు గాను ఒక్కరే ప్రార్థనా సమయానికి హాజరు కావడంతో.. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన ముగ్గురు ఉపాధ్యాయులకు ఒక్కపూట సెలవు వేసినట్లు ఎంఈవో తెలిపారు. చరికొండ ఉన్నత పాఠశాలను సందర్శించి మండల నోడల్ అధికారి జంగయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసులుతో కలిసి ప్రార్థనలో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ముద్విన్ తండాను సందర్శించగా ఇద్దరు ఉపాధ్యాయులకు ఇద్దరు హాజరుకావడంతో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పల్లె చెలుక తండా ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులకు ఒకరు సెలవుపై వెళ్లగా ఇద్దరు ఉపాధ్యాయులు విధులకు హాజరైనా విద్యార్థులు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచకపోతే చర్యలు తప్పవని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్నం 3:15 గంటలకు పెద్దిరెడ్డి చెరువు తండా ప్రాథమిక పాఠశాలను, 3:30లకు నాగిరెడ్డి తండా పాఠశాలల సందర్శనకు వెళ్లగా రెండూ తాళాలు వేసి ఉన్నాయి. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేయాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయకులను ఎంఈవో ఆదేశించారు. న్యామతాపూర్, మక్తమాదారం పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

తలకొండపల్లి, జూన్ 19: వెల్జాలలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి దేవాలయం వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన కల్యాణంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అర్చకులు, వేద పండితులు యాదగిరి నర్సింహయ్య శాస్త్రి ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సామూహిక కుంకుమార్చన, హనుమాన్ చాలీసా, హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ అంబాజీ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కూన రవి, నాయకులు తదితరులు ఉన్నారు.



సంక్షిప్తంగా..

చేవెళ్ల : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహానికి నూతన భవనం మంజూరు చేసి నిర్మించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ మాజీ అధ్యక్షుడు అల్లి దేవేందర్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.
షాబాద్ : తెలంగాణకు విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రారంభమైనప్పటికీ విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలన చేతగానితనం అని ఎద్దేవా చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే మంత్రిని నియమించాలన్నారు.
శంకర్‌పల్లి : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఇన్‌చార్జి ఎంఈవో అక్బర్ తెలిపారు. జన్వాడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బ్రిలియంట్ టెక్నాలజీ కంపెనీకి చెందిన సీఈవో రామ్‌నరేష్‌తో కలిసి బ్యాగులు, నోట్‌పుస్తకాలు షూ, సాక్స్‌లు, స్టేషనరీ అందజేశారు. హెచ్‌ఆర్ మేనేజర్ కృష్ణ, ఆపరేషన్ హెడ్ వంశీ, ఎంపీటీసీ నాగేందర్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులున్నారు.
ఆమనగల్లు : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు ఆమనగల్లు ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులకు నులిపురుగుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
కేశంపేట : రోటరీ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ సేవలు అమోఘమని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రోటరీ క్లబ్ ఎనలేని కృషి చేస్తుందని జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి అన్నారు. పాపిరెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలకు లైబ్రరీ రాక్స్ అందజేశారు. విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు అందించారు. క్లబ్ అధ్యక్షుడు మధులేటి, కార్యదర్శి ఆదినారాయణ, కోశాధికారి జీ.ఎస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
షాద్‌నగర్ అర్బన్ : కాలంతో పాటు పరుగులు పెడుతున్న ప్రతీ ఒక్కరు యోగా సాధన చేస్తేనే సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్లాక్ ఆఫీసు ఆవరణలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా గురువులు శశీధర్, రాంచంద్రయ్యలను సన్మానించారు. బి.జగన్‌మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మురళి, గోపాల్‌నారాయణ్, జనార్ధన్, రాజు, అశోక్‌కుమార్, ప్రకాష్, శుక్లవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్, రఘునందన్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులున్నారు.

క్రైం కార్నర్

పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

మంచాల, జూన్ 19 : బాలిక కిడ్నాప్, అత్యాచారానికి సంబంధించి పోక్సో చట్టం కింద నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఎల్‌బీ నగర్ 11వ అడిషనల్ కోర్టు జడ్జి బుధవారం తీర్పు వెలువరించారు. మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కిడ్నాప్, అత్యాచారానికి సంబంధించి 2022లో కేసు నమోదుకాగా, పోలీసులు విచారణ చేశారు. నిందితుడు విసల్ బింద్(20) దోషిగా తేలడంతో జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

మంగళసూత్రం అపహరణ కేసులో దంపతులకు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష

యాచారం, జూన్ 19 : బెండతోటలో కలుపు తీస్తున్న మహిళ కళ్లలో కారంచల్లి నాలుగున్నర తులాల మంగళసూత్రంతో పాటు రూ.వెయ్యి అపహరించిన దంపతులకు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యేసి జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం న్యాయాధికారి హిమబిందు బుధవారం తీర్పు వెల్లడించారు. యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తక్కళ్లపల్లి తండాకు చెందిన ఆంగోత్‌ఝుంకు 2018 అక్టోబరు 4న తన పొలంలో వేసిన బెండ తోటలో కలుపు తీస్తోంది. మధ్యాహ్నం బైక్‌పై దంపతులు వచ్చి చింతపట్లకు ఎలా వెళ్లాలని అడగడంతె ఝుంకు దారి చూపింది. బైక్‌పై వెళుతూనే తిరిగి వెనక్కి వచ్చి దాహం వేస్తుందని అనడంతో ఝుంకు నీరు అందిస్తుండగా.. కళ్లలో కారం చల్లి మెడలోని నాలుగున్నర తులాల మంగళసూత్రంతో పాటు పర్సులో ఉన్న రూ.వెయ్యి తస్కరించారు. బాధితురాలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏసీపీ మల్లారెడ్డి, ఇన్‌స్పెక్టర్ మధుకుమార్‌లు గాలించారు. ఎట్టకేలకు దంపతులు నందిపాటి వినోద్(25) గోపూరి కీర్తనలు పట్టుబడ్డారు. పోలీసులు రిమాండ్‌కు పంపి వాస్తవాలు కోర్టుకు సమర్పించారు. ఈమేరకు న్యాయాధికారి హిమబిందు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, చెరో రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

బైక్ చోరీకి యత్నం.. పోలీసుల అదుపులో ఇద్దరు

చేవెళ్ల, జూన్ 19 : బైక్‌లు దొంగతనం చేసేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులను గ్రామస్తులు పోలీస్‌లకు అప్పగించారు. ఈ సంఘటన బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ పరిధిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలానికి చెందిన ఇద్దరు యువకులు నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హదర్షాకోట్ ప్రాంతంలో బైక్‌ను దొంగిలించారు. అనంతరం అదే బైక్‌పై చేవెళ్ల మండలానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈక్రమంలో మార్గమధ్యలోని మల్కాపూర్ స్టేజీ వద్ద పార్క్ చేసి ఉన్న కొన్ని బైక్‌లను గమనించారు. వెంటనే వెళ్లి అందులో ఓ బైక్‌ను దొంగిలించేందుకు పథకం వేశారు. బైక్ హ్యాండిల్ లాక్‌ను విరగ్గొట్టేందుకు యత్నిస్తుండగా మల్కాపూర్ గ్రామానికి చెందిన కొందరు గ్రామస్తులు గమనించి లాక్ ఎందుకు విరగ్గొడుతున్నావని ప్రశ్నించారు. అయితే, బైక్ తనదే నంటూ.. తాళం పోయిందని పొంతనలేని సమాధానాలు చెప్పడంతో వారికి అనుమానం వచ్చి గట్టిగా నిలదీయడంతో అసలు విషయం ఒప్పుకున్నారు. అంతకుముందు దొంగిలించిన బైక్ హైదర్శాకోట్ నుంచి దొంగిలించి తీసుకొస్తున్నామని చెప్పడంతో వారిని చేవెళ్ల పోలీస్‌లకు అప్పగించారు. బైక్ దొంగతనం నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగినందున ఆ పోలీస్‌లకు బైక్ దొంగలను అప్పగించినట్లు చేవెళ్ల పోలీస్‌లు తెలిపారు.

నలభై గొర్రెలు అపహరణ

కందుకూరు, జూన్ 19: గుర్తుతెలియని దుండగులు 40 గొర్రెలను అపహరించిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కందుకూరుకు చెందిన కందడి చంద్రయ్యకు మండల కేంద్రం నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన(కములమ్మగడ్డ) గొర్రెల మంద ఏర్పాటుచేశాడు. మంగళవారం రాత్రి గొర్ల మందను అక్కడేపెట్టి భోజనం చేయడానికి ఇంటికెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున చూసేసరికి 40 గొర్రెలు లేకపోవడంతో నివ్వెరపోయాడు. ఇటీవల 4గొర్రెలను దొంగించారని చెప్పాడు. బుధవారం జరిగిన ఘటనపై తిరిగి పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ మక్బూల్‌జానీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏడాది వరకు ఇంటికి రానని.. ఇంటి నుంచి వెళ్లిపోయిన డిగ్రీ విద్యార్థి

● పేపర్‌పై రాసి ఇంటి డోర్‌కు అతికించిన యువకుడు.. పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

కొందుర్గు, జూన్ 19: ఏడాది వరకు ఇంటికి రానని తల్లిదండ్రులకు చెప్పకుండా డిగ్రీ చదివే ఓ యువకుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన మండల పరిధిలోని తంగళ్లపల్లిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం మేరకు... తంగళ్లపల్లికి చెందిన బెస్త బుచ్చమయ్య కుమారుడు తాను డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. ఈనెల 18వ తేదీన సాయంత్రం 4గంటలకు ఇంట్లో నుంచి బైక్‌పై బయటకు వెళ్లిపోయాడు. పోతూ పోతూ తాను ఒక సంవత్సరం వరకు రానని, తన దగ్గర 3వేల రూపాయలు ఉన్నాయని, వాటితో వెళ్తున్నానని ఒక పేపర్‌పై రాసి తలుపునకు అతికించి వెళ్లిపోయాడు. ఈమేరకు కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నలుపు రంగులో ఉండి ఎత్తు 5.6 ఉంటాడని, తెలుగు బాగా మాట్లాడుతాడని, ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఎరుపు రంగు షర్ట్, బ్లూకలర్ జీన్స్ వేసుకొని ఉన్నాడని తెలిపారు. తండ్రి బుచ్చమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులు తాళలేక భర్తపై భార్య ఫిర్యాదు

కొందుర్గు, జూన్, 19: భర్త వేధింపులు తాళలేక ఓ భార్య పోలీసులను ఆశ్రయించింది. వెంకిర్యాలకు చెందిన కొలుముల శ్రీనివాస్‌కు, వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌కు చెందిన అనితతో 2014లో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కూతుళ్లున్నారు. నాలుగేళ్ల నుంచి శ్రీనివాస్ గ్రామంలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని అనితను వేధింపులకు గురి చేసేవాడని, గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా, మంచిగా ఉంటానని, భార్యాపిల్లలను సక్రమంగా చూసుకుంటానని శ్రీనివాస్ చెప్పాడు. అతడి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడం, తరచూ గొడవలు జరిగేవని ఎస్సై తెలిపారు. ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఇప్పించినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదని తెలిపారు. అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు.

వేర్వేరు చోట్ల వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తులు దుర్మరణం

శంషాబాద్/శంకర్‌పల్లి, జూన్ 19 : శంషాబాద్ ఔటర్ రింగురోడ్డుపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి(50) మృతిచెందాడు. ఔటర్ రింగు రోడ్డుపై విధులు నిర్వహిస్తున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. అప్పటికే మృతిచెందాడు. శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై ఆ వ్యక్తి మృతిచెందాడని పోలీసులు తెలిపారు. పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. శంకర్‌పల్లి మండలం మియాఖాన్‌గడ్డలో గుర్తు తెలియని వ్యక్తి(35) గ్రామంలోని పురం యాదిరెడ్డి పొలంలో బుధవారం శవమై కనిపించాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. శవాన్ని చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతిడి పేరు ఊరు వివరాలు తెలియలేదని ఎస్సై అహమ్మద్ పాషా తెలిపారు.

పౌల్ట్రీ షెడ్డుపై నుంచి పడి మరొకరు..

షాద్‌నగర్‌రూరల్, జూన్ 19: ఫరూఖ్‌నగర్ మండలం పీర్లగూడ శివారులోని పౌల్ట్రీషెడ్డుపై నుంచిపడి వడ్డె మల్లేష్(35) అనే వ్యక్తి మృతిచెందాడు. షెడ్డు పైకప్పుగా ఉన్న సిమెంట్ రేకు విరిగిపోవడంతో.. సరి చేయడానికి వెళ్లిన మల్లేష్ రేకు విరగడంతో షెడ్డులో పడ్డాడు. మల్లేష్ తలకు తీవ్ర గాయం కావడంతో మరణించాడు. మృతుడు ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్‌కు చెందినవాడు. భార్య, పిల్లలున్నారు. మల్లేష్ కుటుంబాన్ని పౌల్ట్రీ యజమాని వసంతరావు ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

లేమామిడిలో చైన్‌స్నాచింగ్.. బైక్‌పై పరారైన దుండగుడు

కేశంపేట, జూన్ 19: బైక్‌పై వచ్చిన దంపతులు వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటున్న మహిళ మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును తస్కరించిన ఘటన బుధవారం లేమామిడిలో జరిగింది. కేశంపేట పోలీస్‌స్టేషన్ పరధి లేమామిడి శివారులో ఏర్పు జయమ్మ తన పొలంలో పనిచేస్తోంది. ఈక్రమంలో భార్యాపిల్లలతో వచ్చిన ఓ వ్యక్తి జయమ్మ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును లాక్కొని పారిపోయాడు. సీసీ కెమెరాలో ఆ వ్యక్తి బైక్‌పై వెళ్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. కేశంపేట పోలీసులు చైన్ స్నాచింగ్‌పై విచారణ వేగవంతం చేశారు.